క్లుప్తంగా

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

రామసముద్రం : మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం ఆవరణంలో బుధవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గఫూర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 2025 మార్చి 31వరకు మండలంలోని 19 పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ రకాల పనులపై గత 15రోజులుగా క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందన్నారు. ఈ పనులపై జరిగే ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు

తంబళ్లపల్లె: మండలంలో అర్హత కలిగిన అన్ని మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేసేందుకు బ్యాంకు అధికారులతో సంప్రదించాలని డీపీఎం లక్ష్మిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం రుణాలు తీసుకున్నవారి వద్ద వందశాతం తిరిగి చెల్లింపులు జరిగే విధంగా సీసీలు చొరవ చూపాలన్నారు. అన్ని గ్రూపులతో బ్యాంకు అధికారులతో సమావేశాలు నిర్వహించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి రుణాలు ఇవ్వాలన్నారు. గ్రూపులు మరింత పటిష్టంగా నిర్వహించుకునే విధంగా సీసీలు, సంఘమిత్రలు గ్రూపు సభ్యులకు సహకరించాలన్నారు. సమావేశంలో ఏపీఎం గంగాధర్, జిల్లా ఉన్నతి ఏపీఎం రమేష్, సీసీలు పాల్గొన్నారు.

వాలీశ్వర స్వామికొండలో క్లూస్ టీమ్ పరిశీలన

రామసముద్రం: రామసముద్రం మండలం ఆర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన పురాతన వాలీశ్వర స్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు ఆలయ గోడలు ధ్వంసం చేయడం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం జిల్లాకు చెందిన క్లూస్ టీం సభ్యులు పరిశీలించారు. వేలి ముద్రలు, ఆధారాలను సేకరించారు. ఆలయ అర్చకులు లోకనాథ్ దీక్షిత్, దేవాదాయశాఖ ఈవో రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. వీటి ఆధారంగా త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

అండర్-19 చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ బాల,బాలికల జట్లు ఎంపిక నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. క్రీడాకారులు ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం మధ్య చదువుతూ ఉండాలన్నారు. 1.1.2007 తర్వాత జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు ఇంటర్మీడియట్ చదువుతున్నవారు పదవ తరగతి ఒరిజనల్ మార్కు లిస్టు, స్టడీ సర్టిఫికెట్లు, క్రీడా యూనిఫామ్‌తో ఎంపిక పోటీల్లో పాల్గొనాలన్నారు.

వృద్ధులను చూడాల్సిన బాధ్యత బిడ్డలదే



లక్ష్మీనరసప్పతో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

మదనపల్లె సిటీ: వయోవృద్ధులను చూడాల్సిన బాధ్యత బిడ్డలదేనని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్. మునిగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక సిటీఎం రోడ్డులోని ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధుడు లక్ష్మీనరసప్పను పరామర్శించారు. తన బిడ్డలు తన బాగోగులు చూడటం లేదని, తనకున్న ఆస్తిని బిడ్డలకు రాసిచ్చినట్లు అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. లక్ష్మీనరసప్ప బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అతనికి ధైర్యం చెప్పి మదనపల్లె సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి న్యాయం చేస్తామని తెలిపారు. ఆయన వెంట అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, ఆశ్రమ నిర్వాహకులు ఆనందన్, కవిత తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

రామసముద్రం : విద్యార్థుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ గఫూర్, ఎంఈఓ ఆంజనేయులు సూచించారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వలన విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతో పాటు మురుగు నీటి నిల్వలు లేకుండా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకునేలా విద్యార్థులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాబు పబ్లిసిటీ పిచ్చికి ప్రయాణికుల అవస్థలు


మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపులు


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

- అనంతపురం సభకు తరలిన ఆర్టీసీ బస్సులు
- గంటల తరబడి బస్సులు లేక ప్రజల ఇక్కట్లు
- హైటెక్, నాన్‌స్టాప్, ఎలక్ట్రిక్ బస్సుల్లో అమలుకాని స్త్రీశక్తి పథకం
- రెండింతల చార్జీలు వసూలు చేసిన ఆటోలు, ప్రైవేట్ వాహనాలు


బస్సులు లేక గుర్రంకొండ బస్టాండులో ప్రయాణికుల ఎదురుచూపు



ఆర్టీసీ బస్సుల కొరతతో ప్రైవేట్ బస్సు టాప్‌పై కూర్చోని వెళ్తున్న ప్రయాణికులు

మదనపల్లె రూరల్ : అనంతపురంలో కూటమిప్రభుత్వం నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ - సూపర్‌హిట్ రాష్ట్రస్థాయి విజయోత్సవ సభను ఎలాగైనా విజయవంతం చేయాలన్న ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు ఆర్టీసీ అధికారులు జీహుజూర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో ఉన్న ఆర్టీసీ బస్సుల్లో 85 శాతానికి పైగా సర్వీసులను మీటింగ్‌కు కేటాయించారు. బుధవారం జరగనున్న సభకు మంగళవారం ఉదయం నుంచే బస్సు సర్వీసులు నిలిపేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్టాండుల్లో అయితే ఫ్లాట్ ఫామ్‌లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతుండటంతో, ఊర్లకు బయలుదేరిన మహిళలకు బస్సులు లేకపోవడం, ఉన్న అరకొర బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు కాదని చెప్పడంతో నిట్టూర్పులు విడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లా పాపలతో తల్లిదండ్రులు, వృద్ధులు, వైద్యసేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లేవారు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు...అన్ని వర్గాల ప్రజలు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. బాబు పబ్లిసిటీ పిచ్చికి తాము బలయ్యామంటూ ఆగ్రహావేశాలు ప్రదర్శించారు. అన్నమయ్యజిల్లా నుంచి అనంతపురం సభకు 385 బస్సులను కేటాయించారు. వీటిలో అధికభాగం మదనపల్లె రెండు డిపోల నుంచే ఉన్నాయి. మదనపల్లె-1 డిపోలో మొత్తం 120 బస్సు సర్వీసులు ఉంటే, 20కు పైగా బస్సులు తిరుపతి నాన్‌స్టాప్, బెంగళూరు, చెన్నై అంతరాష్ట్ర సర్వీసులు, హైదరాబాద్, విజయవాడ సూపర్ లగ్జరీ ఉన్నాయి. మిగిలిన 100 బస్సుల్లో 90 బస్సులు అనంతపురం సభకు కేటాయించారు. కేవలం 10 బస్సులు మాత్రమే ప్రయాణీకులకు అందుబాటులో ఉంచారు. మదనపల్లె-2 డిపో విషయానికి వస్తే 82 బస్సు సర్వీసులు ఉంటే 65 బస్సులు అనంతపురంకు కేటాయించారు. మిగిలిన 17 బస్సుల్లో సూపర్ లగ్జరీ, ఇతర సర్వీసులు తీసేస్తే కేవలం 10 బస్సులు మాత్రమే మిగిలాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులను పూర్తిగా నిలిపివేయడంతో ప్రజల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఉదాహరణకు తంబళ్లపల్లెకు ప్రతిరోజు 7 ఆర్టీసీ సర్వీసులు తిరుగుతుంటే, మంగళవారం కేవలం 2 బస్సులు మాత్రమే నడిచాయి. బస్సు మదనపల్లెలో బయలుదేరితే తంబళ్లపల్లె చేరుకునేందుకు గంటన్నరకు పైనే పడుతుంది. ఈలెక్కన ఒక బస్సు కోసం ప్రయాణికులు సుమారు 2 గంటలకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. ఇక తిరుపతి, కడప, చిత్తూరు మార్గాల్లో వెళ్లే ప్రయాణికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రయాణికులు వందల సంఖ్యలో ఉంటే బస్సులు ఒకటి, రెండు...అవి నాన్‌స్టాప్, సూపర్ లగ్జరీలు కావడం, స్త్రీ శక్తి పథకం చెల్లదని చెప్పడంతో ప్రయాణభారం తడిసిమోపెడైంది. తిరుపతికి నాన్‌స్టాప్ బస్సులో టికెట్. రూ.270 ఉండటంతో సామాన్యులు ఇబ్బందులు పడ్డారు. ధర అధికమైనా బస్సులు అందుబాటులో లేకపోవడం, వచ్చిన కొద్దిపాటి బస్సుల్లో నిల్చుని వెళ్లాల్సి రావడంతో మహిళలు అవస్థలు పడ్డారు.

బస్సుల కొరతతో ప్రయాణికుల ఇక్కట్లు

గుర్రంకొండ: అనంతరపుంలో బుధవారం నిర్వహించనున్న కూటమి ప్రభుత్వ బహిరంగ ఏఫెక్ట్ కారణంగా ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే ఆర్టీసీ బస్సులు పలు మార్గాల్లో నడవలేదు. విషయం తెలియని సాధారణ ప్రజలు, ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కొసం పడిగాపులు పడ్డారు. ముఖ్యంగా విద్యార్థులు బస్సుల కొరత కారణంగా సకాలంలో ఇళ్లకు చేరుకోలేక నానా కష్టాలు పడ్డారు. ఇదే అదునుగా భావించిన ఆటోలు, ఇతర ప్రయివేట్ వాహనాలు ప్రయాణికుల దగ్గర ఛార్జీల పేరుతో నిలువుదోపిడి చేశాయి.

మూడింతలు వసూలు

సాధారణ బస్‌చార్జీలతో పోల్చితే మూడింతలు వసూలు చేశారు. గుర్రంకొండ నుంచి మదనపల్లెకు సాధారణంగా రూ.50 చార్జీలు కాగా ఈరోజు బస్సుల కొరత కారణంగా రూ.100 నుంచి రూ. 150 వరకు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు వసూలూ చేయడం దారుణమని ప్రయాణిలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులుసైతం అధిక రవాణా చార్జీలు చెల్లించి ఇళ్లకు వెళ్లడం గమనార్హాం.

దీనికి తోడు వందలాది మంది ఉద్యోగులు రాయచోటి, మదనపల్లె, కలకడ, పెద్దమండ్యంతో పాటు ఇతర మార్గాల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లడానికి బస్సులు లేక నానా ఇబ్బందులు పడ్డారు.

ఉచిత ప్రయాణం ఎక్కడ...?

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కూటమిప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్పితే, ఆచరణలో అమలు కావడం లేదు. సీఎం అనంతపురం సభ కోసం బస్సులన్నీ పంపేయడంతో సామాన్యులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. తిరుపతి వెళ్లేందుకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు నాన్‌స్టాప్, లగ్జరీ బస్సులు తప్ప ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు లేకపోవడంతో విద్యార్థినులు, మహిళలు, రోగులు ఇబ్బందులు పడ్డారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి మంచిది కాదు.

- మురళీ, సీపీఐ, నాయకుడు మదనపల్లె

గంటన్నరకు పైగా బస్సు లేదు

మార్కెటింగ్ పనిమీద నెల్లూరు నుంచి మదనపల్లెకు వచ్చాను. ఇక్కడ పనిపూర్తిచేసుకుని చిత్తూరుకు వెళదామంటే గంటన్నరకు పైగా బస్సులు రాలేదు. గతంలో ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉండేది. ప్రయాణీకులు వందల సంఖ్యలో ఉన్నారు. ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు.

- ప్రవీణ్, నెల్లూరు

మదనపల్లె మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేష్

మదనపల్లె: మదనపల్లె మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే.రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కోటేశ్వరీ విధులు నిర్వహిస్తుండగా ఆమెను తప్పించి రమేష్‌కు ఈ రెండు బాధ్యతలను అప్పగించారు. కోటేశ్వరీని ఎక్కడ నియమిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొనలేదు. ప్రభుత్వం మదనపల్లె మెడికల్ కళాశాలను పీపీపీ మోడ్ కింద ప్రైవేటుకు అప్పగిస్తున్న సమయంలో కోటేశ్వరీని ప్రిన్సిపాల్ విధుల నుంచి తప్పించడం చర్చనీయాంశమైంది.

ఏపీలో మద్యం ఫుల్.. ఎరువులు నిల్

కలకడ : ఏపీలో మందుబాబులకు మద్యం మాత్రం నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు.. రైతులకు మాత్రం అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించలేక పోతోందని కాంగ్రెస్ పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం కలకడలో రైతులతో కలిసి ఎరువుల కొరతపై ర్యాలీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి వినతిపత్రం అందజేశారు. మండలంలోని రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయలేకపోతున్నరాన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక నష్టపోవడం రైతు వంతుగా మారిందన్నారు. మార్కెట్ సదుపాయాలు కల్పించాలని, దళారి వ్యవస్థ రద్దు చేయాలని, రైతుల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షురాలు మల్లిక, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్‌కెబాష, జిల్లా ఉపాధ్యక్షులు హిదాయతుల్లా, సమీర్, మస్తాన్, రెడ్డి, ఆదినారాయణ, ఖాజా, తిరుమలేష్, మహేష్ పాల్గొన్నారు.

సహజ ఎరువుల వినియోగం పెరగాలి

నిమ్మనపల్లె : రైతులు సహజ ఎరువుల వినియోగం పెంచేలా సాగువిధానాలు అవలంబించాలని మండల ప్రత్యేకాధికారి సతీష్, వ్యవసాయ అధికారి మంజుల అన్నారు. మంగళవారం మండలంలోని రాచవేటివారిపల్లె, బండ్లపై గ్రామాల్లో సహజ ఎరువులు, నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. సహజ ఎరువుల వాడకంతో భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిన నేతలు


కలికిరి: అన్నదాత పోరుకు తరలుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నాయకులు


రైతుపోరుబాటలో కలకడ మండల రైతులు, నాయకులు


రైతు పోరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కలికిరి(వాల్మీకిపురం): జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి వాల్మీకిపురం మండలం నుంచి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాత రోజు రోజుకు నష్టాల్లో కూరుకుపోతున్నారని, మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఎరువులు దొరక్క, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో రైతన్నకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమై రైతులను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ రైతులకు అండగా నిలిచి ప్రభుత్వ కళ్ళు తెరిపించడానికి అన్నదాత పోరు తలపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, నాయకులు రవీంద్రరెడ్డి, విజయశేఖర, ఓబుల్‌రెడ్డి, మునిభాస్కర, రామక్రిష్టారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగరాజ, రామచంద్రారెడ్డి, పూల శీన, మోహన్‌రెడ్డి, శీను తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

అన్నదాతపోరులో కలకడ రైతులు

కలకడ : జిల్లాలో జరిగిన అన్నదాత పోరులో కలకడ మండల రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రం రాయచోటిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన అన్నదాత పోరులో కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు కెఎస్ మస్తాన్‌అమ్మహద్, రైతు సంఘంనాయకులు,కుమార్‌నాయుడు, మోహన్‌రాజ్‌నాయుడు, యువత, విద్యార్థి విభాగం నాయకులు బి.లక్ష్మన్న, శివారెడ్డి, బాబురెడ్డి, మున్న, అంజన్‌కుమార్, నటరాజ్, వెంకట్రమణ రెడ్డి,జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం నుంచి..

రామసముద్రం : జిల్లా కేంద్రం రాయచోటిలో మంగళవారం జరిగిన రైతు పోరుకు రామసముద్రం మండలం నుంచి ఆ ఆపార్టీ రైతు సంఘం అధ్యక్షుడు పురాండ్లపల్లి ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు తరలివెళ్లారు. అక్కడ కలెక్టర్ కార్యాలయంలో ఎదుట యూరియాపై జరిగిన నిరసన పోరులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కేశవరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గెవన్న, జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పిటిసి రామచంద్రారెడ్డి, మండల బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డి వీరేగౌడు, హరినాథనాయుడు తదితరులు తరలివెళ్లారు.

ఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికుల కడుపుకొట్టిన గతంలో ఇక్కడ పని చేసిన ఈఓ గురుమోహన్‌పై చర్యలు తీసుకోవాలని, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి. రమణ, డి. వెంకటరమాయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈవో గురుమోహన్ కార్మికుల వద్ద వెట్టచాకిరి చేపించుకుని రెండు నెలలు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. అలాగే గతంలో పెంచిన జీతాలు కూడా తగ్గించేశారని వాపోయారు. 46 మంది కార్మికులకు సంబంధించి రూ. 11 లక్షలు జీతాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి తమకు జీతాలు ఇచ్చి ఆదుకోవడం తోపాటు, తమను ఇబ్బందులకు గురి చేసిన ఈవో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులి రెడ్డెప్ప, నాగార్జున, రమణ, ఓబులయ్య, సుబ్రమణ్యం, యూకూబ్, శాంతకుమారి, రాజేశ్వరి, చిట్టెమ్మ, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ చెత్తను సేకరించాలి

డీపీఓ రాధమ్మ


గుర్రంకొండలో స్వామిత్ర సర్వేను తనిఖీ చేస్తున్న డీపీఓ రాధమ్మ

గుర్రంకొండ: ప్రతిరోజూ గ్రామాల్లో తప్పనిసరిగా చెత్తను సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. చెత్తసేకరణ పనుల తీరుపై ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. గ్రామంలో చెత్తసేకరణ కొన్ని ప్రాంతాల్లో నిర్వహించడం లేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీవో వివరణ కోరగా మారుముల గ్రామాల్లో సైకిల్ రిక్షాలు వెళ్లలేకపోతున్నాయని, దీంతో చెత్తసేకరణకు అంతరాయం కలుగుతోందని పారిశుద్ధ్య కార్మికులు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రతిరోజు కాకుండా రెండురోజుల కొకమారు చెత్తసేకరణ చేస్తున్నారని ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్‌లతో చర్చించి వాహనాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

స్వామిత్ర సర్వే గడువులోగా పూర్తిచేయండి:

స్వామిత్ర సర్వే నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని గుర్రంకొండ పట్టణంలో నిర్వహిస్తున్న స్వామిత్ర సర్వేను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంతవరకు జరిగిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పట్టణంలో 70 శాతం మేరకు స్వామిత్ర సర్వే పూర్తి చేసినట్లు అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిగిలిన 30 శాతం సర్వేపనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ ఈవో శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, నిస్సార్, సంధ్యరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బిజినెస్ అండ్ టెక్నాలజీపై అవగాహన


హర్షద్ బాషాకు సత్కారం చేస్తున్న యూనివర్సిటీ అధికారులు

కురబలకోట: వ్యాపార రంగం కొత్త పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో టెక్నాలజీల ప్రభావం అధికమని తిరుపతిలోని డేటా కోట్స్ ఎడ్యుటెక్ ఫౌండర్, సీఈఓ బి.హర్షద్‌బాషా అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ నూతన విద్యార్థులకు మంగళవారం ది ఫ్యూచర్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు వ్యాపారంలో టెక్నాలజీని అవగాహన చేసుకున్న వారే ముందుంటారన్నారు. సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం, డిజిటల్ నైపుణ్యాలు అవసరమన్నారు. స్టార్టప్‌ల అవకాశాలు, గ్లోబల్ మార్కెటింగ్‌పై అనుభవం గడించాలన్నారు. ముఖ్యంగా వ్యాపార రంగంలో రాణించాలంటే ఎప్పటికప్పుడు నేర్చుకోవాలి..ఆపై నడిపించాల్సి ఉంటుందన్నారు. పోటీ ప్రపంచంలో వినియోగదారుల అవసరాలను గుర్తించి మేనేజ్‌మెంట్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వ్యాపార ధోరణులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

గర్భిణులు ఆరోగ్య మెలకువలు పాటించాలి

పీలేరు : గర్భిణులు ఆరోగ్య మెలకువలు పాటించాలని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీలో 26 మంది గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సురక్షిత మాతృత్వం కోసం ప్రతి గర్భిణీ స్త్రీ నిర్దేశించిన రోజుల్లో ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఆరోగ్యకర సంతతి కోసం ప్రాథమిక ఆరోగ్య సేవల్లో ప్రభుత్వ అందించే ఆరోగ్య పథకాలు, మెరుగైన ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెరువులు, కాలువల్లో అక్రమ నిర్మాణాలు తొలగించండి


ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె రూరల్ : పట్టణ, మండల పరిధిలోని చెరువులు, నదులు, నీటిపారుదల కాలువలను ఆక్రమించి చేపట్టిన అక్రమనిర్మాణాలను తొలగించాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ కోరారు. మంగళవారం బహుజన యువసేన ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ....కోమటివానిచెరువు, తట్టివారిపల్లె, అమ్మచెరువు, నక్కలకుంట చెరువులు, బాహుదా కాలువ, కురవంకల్లో నీటిపారుదలశాఖకు సంబంధించిన స్థలాలను యథేచ్చగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారన్నారు. వీటికారణంగా చెరువులకు నీళ్లు చేరక, పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సహజసిద్ధమైన నీటిమార్గాలు ఆక్రమణకు గురవడంతో వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే వరదలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కోమటివానిచెరువు బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదుచేస్తే..ఇరిగేషన్ అధికారులు చేయాల్సి ఉందని చెప్పారన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో చెరువులు, వంకలు, కాలువలను సర్వే చేయించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానీబాషా, శ్రీనివాసులు, శశికుమార్, వినయ్, ద్వారక, సాయికిరణ్, బ్రహ్మ, సంతోష్, జగదీష్, హరికుమార్, విఘ్నేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా వినియోగించాలి

కలికిరి: రైతులు యూరియాను అవసరం మేరకే వినియోగించాలని తహసీల్దారు హరికుమార్ అన్నారు. మండలంలోని మద్రికుంటపల్లిలోని ఆర్ఎస్‌కే కేంద్రంలో మంగళవారం నానో ఎరువులు, జీవన ఎరువుల వినియోగంపై ఏఓ హేమలత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరైన తహశీల్దారు మాట్లాడుతూ మార్కెట్‌లో అందుబాటులో వున్న నానా యూరియా, నానో డీఏపీలపై వాడకంపై రైతులు దృష్టి సారించాలని, అలాగే జీవన ఎరువులు వినియోగించాలని సూచించారు. జీవన ఎరువుల వియోగంతో కలిగే ఉపయోగాలను ఏఓ రైతులకు వివరించారు. ఏఈఓ ఇంద్ర, వీఆర్ఓ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఎరువులపై దృష్టి సారించండి

కలకడ : మండలంలోని రైతులు కేవలం యూరయా ఒక్కటే కాకుండా ప్రత్యామ్నాయ నానో ఎరువులపై కూడా దృష్టి సారించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ కోరారు. మంగళవారం మండలంలోని ఎనుగొండపాళ్యెం సచివాలయం పరిధిలోని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. రైతుసేవా కేంద్రంలో ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతులకు యూరియా బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. యూరియా అక్రమ రవాణకు పాల్పడితే కేసులు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. గడ్డిపంటకు నానో యూరియ కూడా పిచికారి చేసుకుని ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని అన్నారు. రైతులు ఇతర సేంద్రీయ ఎరువుల వినియోగంపై కూడా దృష్టి సారించాలని కోరారు. ఏఓ యంఆర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, రైతుసేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నానో యూరియా వాడకం పెంచాలి

మదనపల్లె రూరల్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని, నేల ఆరోగ్యసంరక్షణకు ప్రాధాన్యమిస్తూ నానో యూరియా వాడకం పెంచాలని ఏఓ నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని పోతబోలు, కొండామద్రిపల్లె, వలసపల్లె రైతు సేవాకేంద్రాల్లో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ నవీన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...ఏటా ఎరువుల వినియోగంతో అనర్థాలు పెరుగుతున్న తరుణంలో వాటి నియంత్రణకు నానో యూరియాను వినియోగించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని దశలవారీగా తగ్గించేందుకు, గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీల స్థానంలో ద్రవరూప నానో యూరియా, డీఏపీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక బస్తా గుళికల యూరియాతో సమానంగా అరలీటరు నానో యూరియా పనిచేస్తుందన్నారు. మండల ప్రత్యేక అధికారి లక్ష్మీపతి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

కేవీపల్లె : రైతులు అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లెలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో మాదవి, సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.